క్లుప్తంగా

అంగన్‌వాడీ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ


గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరమాల ప్రదర్శిస్తున్న చిన్నారులు

మద్దిపాలెం: అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు నాణ్యమైన పూర్వ, ప్రాథమిక విద్యతో పాటు సమగ్ర అభివృద్ధి సంరక్షణ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీడీపీవో నీలిమ తెలిపారు. 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పూర్వ బాల్య దశ సంరక్షణ విద్య(ఎర్లీ చైల్డ్‌హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటు అందించేలా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పిల్లల విషయాల్లో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు అక్షరమాల, గణితం వంటి అంశాలను నేర్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ప్రథమ టీం సభ్యురాలు ప్రమీల, టీచర్ మౌలాబీబీ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బృందా ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ ఎస్ఎస్‌పీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ఆంకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ వంశీధర్ పుట్రేవు, ఇతర వైద్య బృందం పాల్గొని బీపీ, సుగర్, ఇతర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. మురళీనగర్ ప్రజలు, వాకర్స్, సందర్శకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోనీ బ్రావియా నూతన మోడల్స్ ఆవిష్కరణ


సోనీ నూతన మోడల్స్‌ను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు

సీతంపేట: జపనీస్ ఎలక్ట్రానిక్ దిగ్గజం సోనీ కంపెనీ 2025 నూతన మోడల్స్‌ను శనివారం ఆవిష్కరించారు. డైమండ్ పార్కు సమీపంలోని సాయిరామ్ పార్లర్ ఎదురుగా ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రావియా 5 టీవీ, బ్రావియా సిస్టమ్ 6 హోమ్ థియేటర్, బ్రావియా బార్ 6 సౌండ్‌బార్ మోడల్స్‌ను బజాజ్ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధి ప్రదీప్, సోనీ ఇండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెడ్ అయ్యప్పన్, డిప్యూటీ మేనేజర్ రాజశేఖర్‌లు ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సోనీ ప్రతినిధులు మాట్లాడుతూ నూతన మోడళ్లు వినియోగదారులకు ఆధునిక హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ అనుభూతిని అందిస్తాయని తెలిపారు.

పోరాటాలకు సిద్ధం కండి


సీఐటీయూ జిల్లా మహాసభల్లో మాట్లాడుతున్న నరసింగరావు

కంచరపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. కంచరపాలెంలోని ఒక కమ్యూనిటీ హాలులో శనివారం సీఐటీయూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు.. మోదీ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాజధాని నిర్మాణానికి మరో 40 వేల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా విధానాలపై వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే మరిన్ని పోరాటాలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను, సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని తీర్మానించారు. ముందుగా సిటు పూర్వ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు సిటు పతాకావిష్కరణ చేశారు. ప్రజానాట్య మండలి కళాకారులు కార్మికులను ఉత్తేజపరుస్తూ అభ్యుదయ గీతాలను ఆలపించారు. మహాసభల్లో ఎ.అజశర్మ, కె.లోకనాథం, ఆర్.శంకరరావు, ఎం.శ్రీనివాస్, పి.మణి, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, ఎల్.జె.నాయుడు, వై.సత్యవతి, చిరంజీవి, ఎం.చంటి తదితరులు పాల్గొన్నారు.


సీతమ్మధార సంక్షేమ హాస్టల్‌లో నేల మీద నిద్రిస్తున్న కాలేజీ విద్యార్థులు


సీతమ్మధార ఎస్సీ హైస్కూల్ విద్యార్థుల హాస్టల్‌లో లైట్లు లేని బాత్‌రూమ్‌లు


నిరుపయోగంగా వాష్ బేసిన్లు.. పనిచేయని ట్యాప్‌లు

తిండి, నిద్ర, చదువు ▸ కటిక నేలపైనే..

‘ఉత్తర’లో హీనంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు

- సంక్షేమ హాస్టళ్లలో కనీస సదుపాయాలు కరువు
- నానా అవస్థలు పడుతున్న విద్యార్థులు
- కన్నెత్తి చూడని పాలకులు

ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు హీనంగా దర్శనమిస్తున్నాయి. వీటి బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులు నిత్యం ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. నేలపైనే తిండి, నిద్ర, చదువుతో ఇబ్బందులు పడుతున్నారు. హాస్టళ్ల పరిసరాలు చెప్పలేనంత అధ్వానంగా ఉన్నాయి. ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. మరుగుదొడ్లు బాగోలేవు. వాష్ బేసిన్లు, టాయిలెట్ల ట్యాప్‌లు పాడయ్యాయి. వసతి గృహాల పరిస్థితి ఇంత దారుణంగా తయారైనా.. వాటి గోడును పట్టించుకోవాలన్న చిత్తశుద్ధి అధికారుల్లో లేకుండా పోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులంతా అల్లాడుతున్నారు.


సీతమ్మధార ఎస్సీ వసతి గృహంలో నేలపైనే కూర్చుని భోజనాలు చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సీతమ్మధార ఎన్‌బీఎం లా కాలేజీ సమీపంలో రెండు ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఒకటి 3 నుంచి 10వ తరగతి బాలురకు కాగా.. మరోటి ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థుల(బాయ్స్) కోసం కేటాయించినది.

- కాలేజీ హాస్టల్‌లో సుమారుగా 60 మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. వీరంతా నేల మీదే నిద్రిస్తున్నారు. వీరికి కనీసం చిన్న చిన్న మేట్రస్‌లు కూడా లేవు. ఒక గదిలో కనీసం 6 ఫ్యాన్లు ఉండాల్సి ఉండగా.. మూడు మాత్రమే ఉన్నాయి.
- హాస్టల్‌లోని పలు వాష్‌రూమ్‌లను వార్డెన్, ఇతర సిబ్బంది కోసం తాళాలు వేసి ఉంచుకున్నారు. మిగిలిన కొన్ని మాత్రమే విద్యార్థులు వినియోగిస్తున్నారు. వాటిలో కుళాయిలు పనిచేయడం లేదు. కొన్ని రిపేర్లు చేయాల్సి ఉంది.

సీతమ్మధార హాస్టళ్లలో సమస్యల తిష్ట

- ఓపెన్ డ్రైనేజీ సిస్టంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ కాలువలోనే ఆహార వ్యర్థాలు చేరి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.
- హాస్టల్‌లోని వాటర్ ప్లాంట్ మూలకు చేరింది. ఇక్కడి విద్యార్థులు పక్కనే ఉన్న హైస్కూల్ హాస్టల్‌లో నిల్వ చేసిన వాటర్ క్యాన్‌ల నుంచి వచ్చే నీరు తాగుతున్నారు. మామూలు నీటిని వాటర్ క్యాన్‌ల్లో నింపి విద్యార్థులకు అందిస్తున్నారు. ఇవి ఎంత సురక్షితమో అధికారులే చెప్పాలి.
- హైస్కూల్ హాస్టల్‌లో మంచినీటి పరిస్థితి దారుణం. వాటర్ క్యాన్‌ల్లో నీటిని నింపి తాగేందుకు ఇస్తున్నారు. భోజనాల ప్లేట్లు కడుక్కునే వాష్ బేసిన్లు ఒక్కటి కూడా పనిచేయడం లేదు. పిల్లలు దుస్తులు ఉతుక్కునే ప్రదేశంలోనే ప్లేట్లు కడుక్కుంటున్నారు.
- ఇక్కడి అధిక శాతం టాయిలెట్లలో లైట్లు వెలగడం లేదు. రాత్రి వేళల్లో వాష్‌రూమ్‌లను వినియోగించేందుకు విద్యార్థులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కప్పరాడ హాస్టల్‌లో వసతుల లేమి


కప్పరాడ వసతి గృహంలో మంచాలు లేక నేలపై పడుకున్న విద్యార్థులు


పడక గదిలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: కప్పరాడ గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. నగరంలోని పలు కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు సుమారు 375 మంది ఇక్కడ ఉంటున్నారు. మూడు పూటల భోజనాలు పెడుతున్నా.. డైనింగ్ హాల్ లేక హాస్టల్ గదుల్లోనే భోజనాలు చేస్తున్నారు. వంటశాల శిథిలమవడంతో వర్షపు నీరు చేరుతోంది. హాస్టల్ ప్రాంతం లోతట్టుగా ఉండటంతో వర్షాలు పడేటప్పుడు నీరు నిలిచిపోతుంది. ఆ సమయంలో దోమలు వృద్ధి చెందడంతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. గదుల్లో లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదు. మంచాలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. ఈ హాస్టల్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన మరుగుదొడ్లు, స్నానం గదులు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.


అధ్వానంగా కప్పరాడ హాస్టల్ పరిసరాలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హాస్టల్‌లో ఆధునికీకరించిన మరుగుదొడ్లు

మాధవధార హాస్టల్‌లో సదుపాయాలు శూన్యం


మాధవధార గిరిజన బాయ్స్ హాస్టల్‌లో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు


విద్యార్థులకు పెడుతున్న ఉడకని పొంగలి

మద్దిపాలెం: మాధవధార వుడా కాలనీలోని గిరిజన సంక్షేమ బాయ్స్ హాస్టల్–3లో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ సుమారు 250 నుంచి 300 మంది వరకు ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదువుకునే విద్యార్థులు ఉన్నారు. మంచాలు లేక నేలపైనే బొంతలు, దుప్పట్లు వేసుకుని నిద్రిస్తున్నారు. ఆహార నాణ్యత సరిగా లేదు. అన్నం అస్సలు బాగోలేదు. విద్యార్థులకు మెనూ ప్రకారం లంచ్ బాక్స్‌లోకి అన్ని ఆహార పదార్థాలు ఇవ్వాలి. ఇక్కడ రైస్ మాత్రమే ఇస్తున్నారు. మెనూలో ఉన్నట్టు ఒక్క రోజూ కూడా ఆహారం పెట్టడం లేదు. తాగునీరు, వాడుక నీరు సరిపోవడం లేదు. దోమల బెడదతో విద్యార్థులు సతమతమవుతున్నారు. దుస్తులు ఉతుక్కునేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు.


నాణ్యత లేని భోజనం

నయవంచనే కూటమి ప్రభుత్వ నైజం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 45, 54 వార్డుల్లో ‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’

తాటిచెట్లపాలెం: గత ఎన్నికల్లో అమలు కాని బూటకపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు దుయ్యబట్టారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు రూ.1,500, దీపం పథకం ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా మూడు సిలిండర్లు, తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు, రాష్ట్రంలో మహిళలు ఎక్కడికెళ్లినా ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు భృతి, 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నాయకులు బూటకపు హామీలిచ్చారని గుర్తుచేశారు. నేడు ఇవి అమలు చేయమని ప్రజలడుగుతుంటే.. చంద్రబాబు తప్పించుకుంటున్నారని విమర్శించారు. హామీలు అమలుకాకపోతే ప్రశ్నిస్తానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు.

మహిళా పక్షపాతి వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతని కె.కె.రాజు అన్నారు. సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పదవులను మహిళలకే కేటాయించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం మహిళల ఆశలను ఆసరాగా తీసుకుని, నేటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.


45వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

అనంతరం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను స్క్రీన్ మీద వేసి చూపించారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, సతీష్, నానిబాబు, నర్సారావు, ప్రభాకరరావు, దుర్గేష్, సత్యానందం రెడ్డి, చిన్నారావు, రవిశంకర్, ఆదిలక్ష్మి, సువర్ణ, సన్నీ, నాయుడు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన 45వ వార్డు ప్రజలు, పార్టీ నాయకులు

మోసపూరిత హామీలతో ప్రజలకు టోపీ

కంచరపాలెం: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు 104 ఏరియా మహారాణి వీధి కమ్యూనిటీ హాల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కడితి చిరంజీవి నేతృత్వంలో జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కుమార్, రమణమ్మ, శ్రీను, అచ్యుతరావు, ప్రసాద్, రమేష్, శ్రీనివాసరెడ్డి, మోహన్, హరినాథ్‌రెడ్డి, సుగుణ, గ్రామ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.


‘బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, కడిత చిరంజీవి, నాయకులు

‘ఆది కర్మయోగి’ శిక్షణ పూర్తి


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్


ఆది కర్మయోగి శిక్షణ పూర్తి చేసుకున్న నాలుగు జిల్లాల అధికారులు

తాటిచెట్లపాలెం: గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ‘ఆది కర్మయోగి’ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గిరిజన గ్రామాభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు రూపొందించిన ఈ కార్యక్రమంలో భాగంగా, విశాఖలోని బెస్ట్ వెస్ట్రన్ హోటల్‌లో ఈ నెల 23న ప్రారంభమైన రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పూర్తి చేసుకున్న జిల్లాల అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు చిత్తశుద్ధితో ‘ఆది కర్మయోగి’ కార్యక్రమ లక్ష్యాలను సాధించే దిశగా వివిధ శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను, శిక్షణ అందించిన రిసోర్స్ పర్సన్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు పీవీఎస్ నాయుడు, పి. మురళీధర్, డాక్టర్ ఎం. రమేష్ బాబు, ఎస్.వై. నూరాని, కె.సురేష్ బాబు, పి.వనజ, ఎం. ఉమాపతిలతో పాటు డాక్టర్ ఆర్. కృష్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలు నిర్వీర్యం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

సీతంపేట: ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టాలు రోజురోజుకూ నిర్వీర్యమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా ఐదో మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. పోరాటాలతోనే ఎస్టీ, ఎస్సీ అత్యాచార నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. దానితోపాటు ఇప్పుడున్న చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోకి చేర్చాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. ఎంతో మంది ఎస్సీలు, ఎస్టీలు ఎలాంటి విచారణ, బెయిల్ లేకుండా జైళ్లలో మగ్గుతున్నారన్నారు. సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వారు దేశాన్ని పాలిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో లౌకికవాదం, సామ్యవాదానికి బి.ఆర్.అంబేడ్కర్ పెద్దపీట వేశారని, ఆ రెండింటినీ తొలగించే కుట్ర నేడు జరుగుతోందన్నారు. 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాట్లాడుతున్నారని.. అందుకే ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వి.ప్రభాకర్, కె.సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రొఫెసర్లు అర్జున్, సూరప్పుడు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు సత్కారం


సత్కారం పొందిన సైనికాధికారులతో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: కళావేదిక కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ 31వ వార్షికోత్సవం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ సైనికా నీకు వందనం.. అభినందనం శీర్షికన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో పనిచేసిన 60 మంది విశ్రాంత సైనికులు, సైనికాధికారులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ దేశ భద్రత కోసం సైనికులు అహర్నిశలు దేశ సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ సేవలందిస్తున్నారని కొనియాడారు. తమ ప్రాణాలను సైతం లెక్కచెయ్యకుండా త్యాగాలు చేయడం సైనికులకే చెల్లిందన్నారు. అటువంటి సైనికులను కళావేదిక సత్కరించడం అభినందనీయమన్నారు. కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ కమల్‌బైద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి డాక్టర్ సత్యప్రసాద్, విశాఖ మహానగర్ సంఘ్ చాలక్ పి.వి.నారాయణరావు, కళావేదిక వ్యవస్థాపకులు డాక్టర్ నండూరి రామకృష్ణ, డాక్టర్ బి.రజని పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరు మసీదు వద్ద రోడ్లు, కాలువలు, బ్రిడ్జి నిర్మాణానికి శనివారం కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.16.78 లక్షలతో సిమెంట్ రోడ్లు, కాలువలు, రూ.14.70 లక్షలతో పాడైన పాత బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంతబాబు, నానాజీ, పద్మ, స్థానిక నాయకులు బండి కనకరాజు, చోటు, ఆసిఫ్, చిన్నూరు గ్రామ అధ్యక్షుడు నవాబ్ పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో విశేష సేవలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.